


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 22-12-2025 | సంపుటి - 26 | సంచిక -214 | రూ : 4 | పేజీలు: 8




2లో

విశాఖ గడ్డపై మెరిసిన

## భారత అమ్మాయిలు..

- తొలి టీ20లో లంకపై టీమిండియా గెలుపు
- 8 వికెట్ల తేడాతో లంక చిత్తు
- అర్ధ సెంచరీతో అదరగొట్టిన జెమీమా రోడ్రిగ్స్
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో టీమిండియా

సరళమైన చట్టాలు, నమ్మకంతో కూడిన

## పాలనతోనే దేశాభివృద్ధి

- సరళమైన చట్టాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న నిర్మలా సీతారామన్
- కర్ణాటకలోని హంపిలో ఆర్థిక శాఖ 'చింతన్ శిబిర్'
- నమ్మకంపై ఆధారపడిన పాలనా వ్యవస్థకు ప్రాధాన్యం
- పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై చర్చ
- వికసిత భారత్ లక్ష్య సాధనకు సంస్కరణలు అవసరం



2లో



2లో

## రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'..

- శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ఎట్ హోం'
- సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో తేనీటి విందు
- పలువురు రాజకీయ, పౌర ప్రముఖులకు రాష్ట్రపతి ఆతిథ్యం

పవన్ కల్యాణ్ సిఫారసుతో

## రూ.35 కోట్లు కేటాయించడం హర్షణీయం





2లో

- కొండగట్టు అంజన్న క్షేత్రంలో 96 గదుల సత్రం నిర్మాణం
- పవన్ సిఫారసుతో నిధులు కేటాయించిన టీటీడీ
- దీని వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్న బండి సంజయ్

రెండేళ్లు ఆగాం...

## ఇక ఆగేది లేదు: కేసీఆర్

- సుదీర్ఘకాలం తర్వాత కేసీఆర్ ప్రెస్ మీట్
- ఇక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరిక
- భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శలు

2లో



టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్లతో

## నారా లోకేశ్ కీలక సమావేశం

- పార్టీనే అందరికీ సుప్రీం అని స్పష్టం చేసిన మంత్రి లోకేశ్
- పార్టీ ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాలని నేతలకు దిశానిర్దేశం
- పెండింగ్ కమిటీలు, నామినేటెడ్ పదవుల భర్తీని వేగవంతం చేయాలని ఆదేశం

2లో





నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో

## ఎంపీఎల్ 4 పోటీలు.. ప్రారంభించిన బ్రహ్మణి

- నాలుగో సీజన్ లోకి అడుగుపెట్టిన మంగళగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- ప్రారంభోత్సవానికి విచ్చేసిన నారా బ్రహ్మణి
- కాసేపు బ్యాటింగ్ చేసిన లోకేశ్ అర్ధాంగి

2లో

# విశాఖ గడ్డపై మెరిసిన భారత అమ్మాయిలు... శ్రీలంకపై ఘనవిజయం

విశాఖపట్నం వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్) అద్భుత అర్ధ సెంచరీతో చెలరేగడంతో, టీమిండియా 8 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలుపొందింది. ఇంకా ఐదు ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యం సంపాదించింది. అంతకుముందు, టాస్ గెలిచిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులు మాత్రమే చేయగలిగింది. లంక బ్యాటర్లలో విష్మి గుణరత్నే (39) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి, క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో శ్రీలంక పెద్ద స్కోరు చేయలేకపోయింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, శ్రీ చరణి తలో వికెట్ పడగొట్టారు. 122 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన (25), షఫాలీ వర్మ (9) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, వారిద్దరూ ఔటైన తర్వాత, జెమీమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించింది. కేవలం 44 బంతుల్లో 10 ఫోర్లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమెకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (15 నాటౌట్) చక్కటి సహకారం అందించడంతో, భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 డిసెంబరు 23న ఇదే స్టేడియంలో జరగనుంది.

## కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ తరపున అభినందనలు



కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ తరపున అభినందనలు తెలియజేస్తున్నాం. ఆయన రాజకీయాల్లో ఉంటూ కూడా ఆదాయాన్ని సమకూర్చుకోకపోగా, తనకున్న సొంత ఆస్తి నుండి రూ.1000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారు. ఆ భూమిలో ఏవియేషన్కు సంబంధించినవి ఏర్పాటు చేయమన్నారు. ఈనాడు రాజకీయాల్లో రూపాయి పెట్టుబడి పెట్టి రూ.100 కోట్లు సంపాదించే పరిస్థితి ఉండగా, అశోక గజపతిరాజు 1000 కోట్ల రూపాయల విలువైన తన సొంత భూమిని ఇవ్వటం ద్వారా రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారు. నేడు సమాజంలో విలువలు దిగజారి పోతున్నాయి. అవినీతిని పరాకాష్టకు చేరింది. ఈ పరిస్థితుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే రాజకీయ నాయకులు ఆయన సేవలను చూసి సిగ్గుతో తలదించుకోవాలి. సమాజం అశోక గజపతి రాజును అభినందించాలి.

## రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'.. హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన శీతాకాల విడిదిలో భాగంగా సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తేనీటి విందుకు తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి ఏటా చేపట్టే శీతాకాల పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా శీతాకాల పర్యటన సందర్భంగా రాష్ట్రపతి హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులతో కలిసి 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. డిసెంబర్ 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'ప్రెసిడెంట్స్ కలర్స్' ప్రదానం చేయడం వంటి అధికారిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. తన పర్యటన ముగింపులో భాగంగా రాష్ట్ర ప్రముఖులకు ఈ విందును ఏర్పాటు చేశారు. ఈ ఎట్ హోం కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ సిఫారసుతో రూ.35 కోట్లు కేటాయించడం హర్షణీయం

తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసుతో ఈ నిధులు మంజూరు కావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. దీని వల్ల కొండగట్టుకు వచ్చే భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవల ఛార్జీలను పెంచి భక్తులపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. టీటీడీ నిధులతో నిర్మించనున్న సత్రం పూర్తయితే కొండగట్టు దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## సరళమైన చట్టాలు, నమ్మకంతో కూడిన పాలనతోనే దేశాభివృద్ధి

భారతదేశాన్ని 'వికసిత భారత్'గా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలంటే సరళమైన చట్టాలు, నమ్మకంపై ఆధారపడిన పాలన చాలా కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వ్యాపార విధానాలను సులభతరం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారానే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. కర్ణాటకలోని విజయనగర జిల్లా హంపిలో ఆదివారం జరిగిన కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖల 'చింతన్ శిబిర్'లో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో రెండు మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, సీబీడీటీ, సీబీఐసీ ఛైర్మన్లు, ముఖ్య ఆర్థిక సలహాదారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన చట్టాలను సరళతరం చేయాలని, ప్రజలు, సంస్థలపై అనుమానంతో కాకుండా నమ్మకంతో కూడిన పాలన అందించాలని మంత్రి సూచించారు. పన్ను ఎగవేతలను గుర్తించడం, విధాన నిర్ణయాల్లో పారదర్శకత పెంచడం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వంటి టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కూడా ఈ శిబిర్‌లో చర్చించారు. విజయనగర సామ్రాజ్యం సాధించిన విజయాలను గుర్తుచేస్తూనే, ప్రస్తుత అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, దేశ ఆర్థిక ప్రగతికి అవసరమైన సంస్కరణలను వేగంగా అమలు చేయడమే ఈ చర్చల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.



## మేడారం మహాజాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్

హైదరాబాద్: మేడారం మహాజాతర2026 పోస్టర్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31వరకు మేడారం జాతర నిర్వహించనున్నారు. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## రెండేళ్లు ఆగాం... ఇక ఆగేది లేదు: కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుదీర్ఘ కాలం తర్వాత ప్రెస్ మీట్ పెట్టారు. కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరించారు. రెండేళ్లు ఆగామని, ఇక ఆగేది లేదని, ఇకపై ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని అన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతోంది... ఈ ప్రభుత్వం ఏం చేస్తోంది? అని ప్రశ్నించారు. భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఉపేక్షించేది లేదని, రాష్ట్రాన్ని రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులు ఎందుకు ముందుకు వెళ్లడంలేదు, ఎవరి కుట్ర ఉంది... ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ విధానాలను ఎండగడతామని కేసీఆర్ హెచ్చరించారు. గోదావరి నీళ్ల దోపిడీపై ప్రభుత్వం స్పందించడంలేదని మండిపడ్డారు. పట్టిసీమ ద్వారా ఏపీ 80 టీఎంసీల గోదావరి నీటిని వాడుకుంటోందని అన్నారు. బచావత్ ట్రైబ్యునల్ ద్వారా ఎగువ రాష్ట్రాలకు ఆ 80 టీఎంసీలు ఇస్తామని ఏపీ చెప్పిందని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర చెరో 20 టీఎంసీలు వాడుకుంటున్నాయని... బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులను పట్టించుకున్న వారే లేరని విచారం వ్యక్తం చేశారు. 40 టీఎంసీలు చాలని కేంద్రానికి ఎలా లేఖ రాస్తారని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. నాడు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పాలమూరుకు ద్రోహం చేశాయని ఆరోపించారు. ఎంత దద్దమ్మ ప్రభుత్వం అయినా పాత ప్రాజెక్టులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఇక మౌనంగా ఉండేదిలేదని, బహిరంగ సభలు నిర్వహించి నీళ్ల కోసం నిలదీస్తామని స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన మోసం నుంచి ఇప్పటికైనా బయటపడాలంటే, కొట్లాడి మన నీటి వాటా సాధించుకోవాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నాడని వెల్లడించారు. కానీ అభివృద్ధి పేరిట ఇష్టానుసారం పునాదిరాళ్లు వేశారే కానీ, అభివృద్ధి మాట మరిచారని విమర్శించారు. ఆ పునాది రాళ్లన్నీ కలిపితే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఒక్క చుక్క నీరు కూడా పొలాల్లోకి పారలేదని, దాంతో పాలమూరు నుంచి ముంబైకి వలసలు పెరిగాయని వివరించారు. ఆనాడు తాను నిలదీయబట్టే చంద్రబాబు జూరాల ప్రాజెక్టు నిర్మించాడని కేసీఆర్ పేర్కొన్నారు. ఆ తర్వాత ఓ టీడీపీ ఎమ్మెల్యే బాంబులతో ఆర్డీఎస్ కాలువను పేల్చేశాడని తెలిపారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణకు పెద్ద శాపంలా మారిందని, మహబూబ్ నగర్ జిల్లాకు తీవ్ర నష్టం జరిగిందని కేసీఆర్ వెల్లడించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి తెలంగాణకు శనిలా దాపురించిందని అన్నారు.

## టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్లతో నారా లోకేశ్ కీలక సమావేశం

పార్టీయే అందరికీ సుప్రీం అని, పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తు.చ.తప్పకుండా పాటించాలని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల అమలు తీరును జోనల్ కోఆర్డినేటర్లు నిరంతరం పర్యవేక్షించాలని లోకేశ్ సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అనుబంధ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా, మిగిలిన నామినేటెడ్ పదవులకు అర్హులైన అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లలో సమస్యలు ఎంతవరకు పరిష్కారమవుతున్నాయో నివేదిక తయారు చేయాలని కోఆర్డినేటర్లను లోకేశ్ కోరారు. డీడీఆర్సీ సమావేశం జరిగే రోజే జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరుపుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాల నిర్మాణంపైనా ఇంఛార్జి మంత్రులతో చర్చించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ కార్యకర్తలు, నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను చట్టపరంగా వేగంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని లోకేశ్ భరోసా ఇచ్చారు.

## నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఎంపీఎల్4 పోటీలు..

గత మూడు సీజన్లుగా క్రికెట్ ప్రేమికులను అలరించిన మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్4 నేడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీ మంత్రి నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రహ్మణి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరిలోని నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన బ్రహ్మణి... అనంతరం మైదానంలోకి దిగి టోర్నీ ప్రారంభించారు. బ్యాట్ చేతపట్టి షాట్లు కొట్టారు. ఓపెనింగ్ మ్యాచ్ ను కొద్దిసేపు వీక్షించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ బాబు, టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కూడా హాజరయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను బ్రహ్మణి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## భావోద్వేగాల నియంత్రణకు ధ్యానం ఉపకరిస్తుంది

**: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**



చేగూరు: భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం ఉపకరిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం చేస్తున్నవారి మనసు ఏకాగ్రతతో ఉంటుంటని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం అందరూ ధ్యానం చేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. "డిసెంబరు 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐరాస ప్రకటించింది. యోగా, ధ్యానంలో భారత్ ఎప్పుడూ ముందుంటుంది. మనదేశం ఓ ఆధ్యాత్మిక కేంద్రం. వికసిత్ భారత్‌లో ఆర్థికాభివృద్ధే కాదు..దేశ శాంతి కూడా భాగంగా ఉంటుంది'' అని పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. శాంతి, సామరస్యం, ఆధ్యాత్మికతను ఈ సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. అందరూ ధ్యానం చేసేలా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ (దాజీ) చొరవ చూపుతున్నారని చెప్పారు. ధ్యానంతో ప్రశాంతంగా ఉండొచ్చని కమలేశ్ డి.పటేల్ (దాజీ) అన్నారు. "ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను జయించొచ్చు. మనసు కేంద్రంగా ధ్యానం చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత వస్తుంది. తద్వారా సునాయాసంగా విజయాలు సాధించొచ్చు. ధ్యానం చేశాక వచ్చే మార్పును మనం గమనించొచ్చు'' అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లు ఒకే వేదికపై ధ్యానం చేశారు.

## భగత్ సింగ్ నగర్ లో విద్యుత్ సమస్యలపై పల్లెబాట



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు ఎదుర్కోంటున్న విద్యుత్ సమస్యలపై ఆదివారం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ నగర్ లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలో పలు సమస్యలపై అధికారులకు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు కొన్ని సమయాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని అన్నారు. లో వోల్టేజీ కారణంగా లోడు ఎక్కువ విద్యుత్ సరఫరా సరిగా అందుతా లేదని అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ స్థానంలో త్రీఫేస్ కరెంటు ఏర్పాటు చేసే దిశలో ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏ. ఈ రాధాకృష్ణారెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ నారాయణస్వామి, సురేష్, శ్రీకాంత్ , సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్ రెడ్డి, బీసు వెంకటేశం గౌడ్, వెంకట్ రెడ్డి, మిక్చర్ రాములు, శ్రీధర్ గౌడ్, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్ గౌడ్, మల్లేష్, శివ పటేల్, నాగరాజు, ప్రదీప్ రెడ్డి, కిషన్ గౌడ్, కమిటీ సభ్యులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. ముస్తాబాద్ పట్టణంలో ఆదివారం వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా ఒళ్ళెపు చందు, ఉపాధ్యక్షులుగా సూర నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మోత్కూరి తిరుపతి, సెక్రటరీగా ఒళ్ళెపు చిన్న కనుకయ్య, సలహదారుగా పెద్ద రంఘయ్య, కార్యదర్శిగా సూర పర్శరాములు, సోషల్ మీడియా సూర రాము, సూర రాజశేఖర్, ఒళ్ళెపు శ్రీనివాస్, ఒళ్ళెపు కృష్ణ, యూత్ అధ్యక్షులుగాసూర రాజనర్స్, ఒళ్ళెపు దేవరాజు, ఒళ్ళెపు రమేష్, ఒళ్ళెపు తిరుపతిలను ఎన్నుకున్నారు.

## గ్రంథాలయం నాకు జీవితాన్ని ఇచ్చింది నిరుపేదలకు దేవాలయం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెం నందు గత కొద్ది సంవత్సరాలుగా చదివి గత సంవత్సరం సింగరేణిలో ఉద్యోగం సాధించిన భూక్య రవి ప్రస్తుతం సింగరేణి హెడ్ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్ గా వర్క్ చేయుచున్నారు , వారికి నిన్న వెళ్ళబడిన గ్రూప్ 3 ఫలితాలలో సీనియర్ ఆడిటర్ గా సెలెక్ట్ అయిన వీరికి గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, గ్రంథాలయ కార్యదర్శి గ్రంథపాలకురాలు జి మణిమృదుల శుభాకాంక్షలు రవి మాట్లాడుతూ గ్రంథాలయం తనకి జీవితాన్ని ఇచ్చిందని గత నాలుగు సంవత్సరాలుగా కష్టపడి చదువుతూ సింగరేణిలో జాబు సంపాదించాను అది ఆదర్శంగా తీసుకొని పార్ట్ టైం లో గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని ఉద్యోగం సాధించానని నాలాంటి నిరుపేదలకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని చేసిన సేవను మరువలేనని కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కొత్తగూడెం పట్టణం రైటర్ బస్తీ లోగల హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన కేంద్రంలో ధ్యానం చేశారు. సెంటర్ కో ఆర్డినేటర్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధ్యానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతినిత్యం కనీసం 30 నిముషాలు ధ్యానం చేయడం వల్ల మనస్సుకి ప్రశాంతంగా లభిస్తుంది అని, చేసే పని మీద శ్రద్ధ ఉంటుంది అని చెప్పారు. కమలేష్ దాజి ఆధ్వర్యంలో ఒకటే హృదయం ఒకటే ప్రపంచం అనే సందేశంతో హార్ట్ ఫుల్ నెస్ స్థాపించి ధ్యానం, యోగ శిక్షణ ఇస్తున్నారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ మెంబర్లు, ట్రైనర్లు, అభ్యాసకులు అందరూ పాల్గొన్నారు.

# నేరేడ్మెట్ జిల్లా పరిషత్ హైస్కూల్ 1986-87 బ్యాచ్ ఘనంగా ఆత్మీయ సమ్మేళనం




మల్కాజ్ గిరి, (ప్రజాస్ఫూర్తి) : ఆత్మీయ సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య స్నేహ బంధాలను పునరుద్ధరించడానికి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి ఉత్తమ అవకాశాన్ని కల్పిస్తాయని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ అన్నారు. నేరేడ్మెట్ జిల్లా పరిషత్ హైస్కూల్ 198687 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ముందుగా తమకు జ్ఞానం అందించిన గురువులు రాజశేఖర్, కృష్ణలకు పాదాభివందనం చేసి గౌరవం చూపారు. ఈ సందర్భంగా సునీత శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఈరోజు ఏ ప్రభుత్వ కార్యాలయంలో చూసినా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే కనిపిస్తారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. ఈ పాఠశాలల్లో చదివిన వందలాది మంది విద్యార్థులు ఇప్పుడు వివిధ ఉన్నత స్థాయిలలో ఉన్నారన్నారు. పూర్వ విద్యార్థులుగా మనం తమ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం ద్వారా రాబోయే తరాలకు మరింత మెరుగైన విద్యను అందించేందుకు దోహదపడవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమాలు పూర్వ విద్యార్థుల మధ్య స్నేహ బంధాలను మరింత బలోపేతం చేశాయన్నారు. ఈ సమ్మేళనంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు



## క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: క్రీడాకారులు సాధించిన పథకాలు విజయాలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పాల్వంచ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించిన జిల్లా క్రీడాకారులను ఘనంగా అభినందించారు. పాల్వంచ మినీ స్టేడియంలో నిరంతరం సాధన చేస్తూ చాంపియన్‌షిప్ స్థాయి విజయాలు సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈచాంపియన్‌షిప్‌లో ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని విజయాలు సాధించడం ప్రత్యేకంగా హర్షణీయమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ శ్వేతతో పాటు విజయం సాధించిన విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అథ్లెటిక్స్‌లో క్రీడాకారులను శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతున్న అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, సెక్రటరీ మహిధర్‌లకు కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గిరిజన విద్యార్థినుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీస్తూ వారికి సరైన మార్గనిర్దేశం అందిస్తున్న అధ్యాపకులు, అధికారుల కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు. వారి నిరంతర కృషి ఫలితంగానే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయిలో క్రీడాకారులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. పాల్వంచ మినీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ టెన్నిస్ రాష్ట్రస్థాయి మీట్‌లో పాల్గొన్న క్రీడాకారులను కూడా జిల్లా కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపించడం భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలకు దారితీస్తుందని అన్నారు. టెన్నిస్ సీనియర్ ప్లేయర్ అన్నం వెంకటేశ్వర్లు జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో విజయం సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావడం గర్వకారణమని పేర్కొంటూ కలెక్టర్ ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ విజయం యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, క్రీడల్లో ప్రతిభ కనబరిచే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామరెడ్డి, విద్యార్థులు, క్రీడాకారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 2000 రోజులకు చేరిన మొక్కలు నాటే ఉద్యమం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చదనమే మన భవిష్యత్తని చాటి చెబుతూ కొట్టూరి సూర్వి రాజశేఖర్ చేపట్టిన మొక్కలు నాటే ఉద్యమం మరో అరుదైన మైలురాయిని అందుకుంది.ప్రకృతి హరిత దీక్షలో భాగంగా ఆరు సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమం 2000 రోజులకు చేరుకుంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుండటంతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని, దీనికి పరిష్కారం పచ్చదనం పెంపొందించడమేనని భావించిన రాజశేఖర్ మొక్కలు నాటడం,వాటిని సంరక్షించడం,వన్యప్రాణులను కాపాడడం లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో ఆయన ముందడుగు వేశారు. ఆరు సంవత్సరాల క్రితం జూలై 1న డాక్టర్స్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాజశేఖర్, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. సింగరేణియన్‌గా సేవలందించిన ఆయనకు మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ప్రశంసలు లభించాయి.ఆదివారం నాడు మొక్కలు నాటే కార్యక్రమం 2000 రోజులకు చేరుకున్న సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం లోని ఆకునూరి కనకరాజు నివాసంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష సభ్యుల సమక్షంలో 2000వ మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆకునూరి కనకరాజు మాట్లాడుతూ "కోటి మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డు అందుకోవాలి" అంటూ మొక్కల రాజశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగం వెంకట పుల్లయ్య (ఎంఈఐ), టీఎన్‌జీవోస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, సింగరేణి టిబిజికేఎస్ మాజీ అధ్యక్షులు ఆకునూరి కనకరాజు, కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. గౌస్ భాయ్, లగడపాటి రమేష్ చంద్, గుండపునేని సతీష్, జి.సుగుణారావు (ప్రకృతి వైద్యులు), ఎండి ముస్తఫా, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు, ఝాన్సీరాణి, దశరథ్ రజువా, తుముల శ్రీనివాస్, డి.శ్రీను, యోగ కోచర్ల కమలారాణి, యంగ్ ఇండియా బాలు, ఇంగ్లీష్ మీడియా బాలు, బ్లడ్ డోనర్ కన్నా, ఫారుల్, నైనిక రజువా, అఫ్ఫాన్ జైధి, ముచ్చాయశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## షిరిడిహిల్స్ లో ప్రజల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్కు వినతి

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,షిరిడిహిల్స్ లో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ సంఘం సభ్యులు , స్థానిక బస్తివాసులు ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ను మగ్దుమ్ నగర్ లోని అయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.దీంతో స్పందించిన కార్పొరేటర్ ప్రజల సమస్యలను దశల వారిగా పరిష్కరించి ఆదర్శ డివిజన్ గా జగద్గిరిగుట్ట ను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి హిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండ మహేందర్,సభ్యులు రాంబాబు,చారి,ఆదిలక్ష్మి,



రాజు,రమేష్,మణి,లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 53వ జన్మదిన మహోత్సవం సందర్భంగా ఆదివారం ప్రగతి నగర్ వైఎస్ఆర్ విగ్రహమునందు రామకృష్ణారెడ్డి (ఆర్ కే), ఏవీ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఆరే శ్యామల రెడ్డి, కారుమూరి వెంకట్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి అతిథులుగా పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, జగన్మోహన్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా మొక్కల నాటిన ప్రకృతి ప్రేమికులు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రకృతి ప్రేమికులు పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు. జిల్లా ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా రామవరం గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతకు మొక్కల నాటకం ఎంతో అవసరమని పేర్కొంటూ, వైయస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భగత్ సింగ్ నగర్ హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కి నిధులు మంజూరు చేయాలని వినతి



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో గల భగత్ సింగ్ నగర్ హిందూ స్మశాన వాటికను అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేయించాలని హిందూ స్మశానవాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి,అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డేగల కృష్ణమూర్తి ల ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన ఆయన జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హిందూ స్మశాన వాటిక కార్యదర్శి రిక్కా ప్రేమ్ కుమార్,కోశాధికారి రవి,అభివృద్ధి కమిటీ సభ్యులు కొమురయ్య, రాధాకృష్ణారెడ్డి,బాల్ రెడ్డి,సత్తిరెడ్డి,కలిసిన వారిలో ఉన్నారు.

## ఘనంగా టీవీఆర్ అధినేత టీ కోటిరెడ్డి జన్మదిన వేడుకలు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఫౌండర్, చైర్మన్ టీ కోటిరెడ్డి 69వ పుట్టినరోజు సంబరాలు ఆదివారం అంబరాన్ని అంటాయి. చింతల్ బీపీఎస్ ఒలంపియాడ్, సూరారం బీపీఎస్ ప్లే స్కూల్, రంగారెడ్డినగర్ బీపీఎస్ స్కూల్, టీవిఆర్ గీతాంజలి, టీవిఆర్ హైస్కూల్ చింతల్, సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ ఎస్ఆర్, టీవిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ, నందు కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుక్కా రామయ్య భావాలను అనుసరిస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా విదేశాలలో విద్యా వ్యవస్థలను చుట్టుముట్టి సింగపూర్ దేశంలో "కీర్తిరత్న " అవార్డు పొందినారు. 60 మంది విద్యార్థులతో పాఠశాల ప్రారంభించి 7 విద్యాసంస్థలు వేల మంది విద్యార్థులు వందల మందికి ఉద్యోగ ఉపాధి కల్పించి కల్పతరువులా నిలిచిన ఆచార్యులు కోటి రెడ్డి అన్నారు. ధర్మం నిన్ను కాపాడుతుంది అన్న సూక్తిని నిజం చేసి గెలిచి నిలిచిన ఆదర్శమూర్తి ఆచార్యులు కోటి రెడ్డి వారికి అత్యంత సాన్నిహిత్యం కలిగిన ఇలాంటి గొప్ప ఆదర్శమూర్తి మార్గాన్ని అనుసరిస్తూ ఉపాధ్యాయులుగా పనిచేయడం మా అదృష్టం అని ఉపాధ్యాయ బృందం మనోభావాన్ని వ్యక్తం చేశారు పుట్టినరోజు వేడుకల్లో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పాఠశాలల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ ప్రాధాన్యత

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ ప్రాధాన్యత అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ గాజుల రామారం గ్రామంలో దాదాపు రూ.47.00 లక్షల తో చేపట్టిన సీసీ రోడ్ పనులకు బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామన్నారు. బస్తీలు , కాలనీల్లో రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో గాజులరామారం డివిజన్‌ను మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, ఇమ్రాన్ బేగ్, మూసా ఖాన్, బోయిని మహేష్, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, గోవర్ధన్ రెడ్డి, నాగేష్, దూలప్ప, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, రాములు గౌడ్, హమీద్, ప్రసాద్, జునైద్, శ్రవణ్, గౌస్, అఖిల్, విజయ్ కుమార్, కాలనీ వాసులు శ్రీశైలం, విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్, కిరణ్, జగన్, వెంకటస్వామి, రవి, కృష్ణ, గిరి, జీతయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణంలో శిలా పనుల ప్రారంభించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణంలో భాగంగా శిలా పనుల ప్రారంభోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామ చంద్ర ప్రభు కృపకటాక్షలతో దేవాలయ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా పూర్తికావాలని అన్నారు.. ఇంతటి దైవిక బృహత్కర్యాన్ని తమ భుజస్కంధాలపై నడిపిస్తున్న కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, కాలనీ అధ్యక్షులు యేసు, కాలనీ సభ్యులు సోమ నర్సయ్య, ఉమేష్ సింగ్, హరీష్, సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, మల్లేష్ గౌడ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, నదీమ్ రాయ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి , కాలే నాగేష్, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, నాయకులు కాలే గణేష్, ఆటో బలరాం, నల్ల ప్రసాద్, కుంట వేణు, బాలమల్లేష్, నారాయణ, వెంకటేష్ గౌడ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, ఏవి.శేషాచారి, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అందర్నీ కలుపుకుంటూ.. అభివృద్ధి చేయడం సర్పంచ్ బాధ్యత

* **అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలి**
* **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పార్టీలకతీతంగా అందర్నీ కలుపుకుంటూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం సర్పంచ్ బాధ్యత అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సూచించారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నూతన సర్పంచులు, వార్డు మెంబర్లకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నల్గొండ జిల్లా పరిధిలోని మునుగోడు, ఘట్టుప్పల్, చండూరు, నాంపల్లి, మర్రిగూడ మండలాల నూతన సర్పంచులు, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాల గెలిచిన గ్రామ సర్పంచులను, వార్డ్ మెంబెర్ లను ప్రతి ఒక్కరికి శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ పదవి అనేది గ్రామానికి చుక్కాని లాంటిదని, తన పర బేధాలు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ గ్రామ అభివృద్ధికి గెలిచిన సర్పంచులు వార్డ్ మెంబర్లు తోడ్పడాలని సూచించారు. ఎన్నికల వరకే పార్టీలు అని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలకతీతంగా నిరుపేదలకు అండగా నిలవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. గ్రామ ప్రథమ పౌరుడిగా, పౌరురాలిగా ప్రతి ఒక్కరికి కష్టసుఖాలలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల ముఖ్య నాయకులు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు మునుగోడు లోని క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో క్యాంపు కార్యాలయం అంతా కోలహలంగా మారింది. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ముఖ్య నాయకులు, ఆయా గ్రామాల ముఖ్య కార్యకర్తలతో పాటు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## కార్పొరేటర్ బొంతు శ్రీదేవిపై వెల్లువెత్తిన నిరసనలు

* **చెల్లని చెక్కుతో భారీ ర్యాలీ – గుడిలో ప్రమాణానికి సవాల్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజనలో భాగంగా తలెత్తిన వివాదం చర్లపల్లి డివిజన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. చక్రిపురం పేరుతో కాకుండా కుషాయిగూడ పేరుతోనే డివిజన్ ఏర్పాటు చేయాలంటూ స్థానికులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు చేపట్టిన ఆందోళనలు క్రమంగా తారాస్థాయికి చేరాయి. స్థానికుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని కుషాయిగూడ పేరుతోనే డివిజన్ ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఈ పరిణామంపై చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తానే పేరు మార్పుకు కీలకంగా కృషి చేశానంటూ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో వివాదానికి దారితీసింది.కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏఎస్‌రావు నగర్ డివిజన్ కార్పొరేటర్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బాధితులు, స్థానికులు సంయుక్తంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. కార్పొరేటర్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ, అడుగడుగున అక్రమ వసూళ్లకు పాల్పడ్డారంటూ ధ్వజమెత్తారు. స్వచ్ఛందంగా పలువురు బాధితులు వేదికపైకి వచ్చి తాము ఇచ్చిన మొత్తాల వివరాలను వెల్లడించడం గమనార్హం. కుషాయిగూడ పేరు మార్పులో తానే కీలక పాత్ర పోషించానంటూ విడుదల చేసిన వీడియోతో చక్రిపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, పరిసర కాలనీల నాయకులు కార్పొరేటర్ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.ఈలోపే వి.ఎన్.రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడి పేరుతో కార్పొరేటర్ అనుచరులు విడుదల చేసిన ప్రకటనకు ప్రతిగా, చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపల్లి పద్మా రెడ్డి సవాల్ విసిరారు. తాను చేసిన ఆరోపణలపై కట్టుబడి ఉన్నానంటూ, కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తడి బట్టలతో ప్రమాణం చేద్దాం అంటూ శనివారం సాయంత్రం బహిరంగ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వందలాది మంది స్థానికులు, నాయకులు, ప్రజాప్రతినిధులు కుషాయిగూడ బస్టాండ్ వద్ద భారీగా చేరుకున్నారు. సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మా రెడ్డి క్షేత్రపాలకుడు హనుమంతుని సాక్షిగా పసుపు నీళ్లతో స్నానం చేసి తడి బట్టలతో, ఎన్నికల సమయంలో కార్పొరేటర్ వర్గం ఇచ్చినట్లు పేర్కొంటున్న చెల్లని 15 లక్షల రూపాయల చెక్కును ప్రదర్శిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం చేరుకున్న వారు, కార్పొరేటర్ మరియు ఆమె అనుచరులు ప్రమాణానికి రావాలని డిమాండ్ చేస్తూ గంటల తరబడి గుడి ప్రాంగణంలో బైఠాయించారు. ఈ సందర్భంగా దారి పొడవునా కార్పొరేటర్‌కు వ్యతిరేకంగా నినాదాలు మార్మోగాయి.మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురుచూసినా కార్పొరేటర్ గానీ, అనుచరులు గానీ ముందుకు రాకపోవడంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా పద్మా రెడ్డి మాట్లాడుతూ నా చిత్తశుద్ధిని నేను నిరూపించుకున్నాను... మరి మీరు ఏంటి? అని ప్రశ్నించారు. వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు గణేష్ ముదిరాజ్, అనిల్ ముదిరాజ్, కృష్ణ, రాజు, మణికిరణ్, వినోద్ ముదిరాజ్, భాస్కర్ పటేల్, శ్రీధర్ ముదిరాజ్, రామచంద్రారెడ్డి, అశోక్, రామకృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నారా శ్రావణ్, రాజు గౌడ్, శ్రీనివాస్, రమేష్ రావు, మహేష్, రాంబాబు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పవన్, విజయ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రెండవ హామీ పెళ్ళికానుక... అందజేసే

* **సర్పంచ్ పెళ్లి కానుకగా పట్టుచీర, రూ. 6116 అందజేసిన తెలుగు సునీత మహిపాల్...**
* **ఒక్కొక్క హామీ అమలు చేస్తుండడంపై కన్ సాన్ పల్లి గ్రామస్తుల సర్వత్ర హర్షం...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: నన్ను సర్పంచ్ ఎలక్షన్ లో గెలిపిస్తే పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కు పెళ్ళికానుక సహాయం రూ. 6116, ఆడబిడ్డ పుడితే రూ. 3వేలు, దహన సంస్కారాల కోసం రూ. 6 వేల ఆర్థిక సహాయం చేస్తాను అంటూ పలు హామీలను కురిపిస్తూ సర్పంచ్ ఎన్నికల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. అందోలు మండలం కన్ సాన్ పల్లి గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి తెలుగు సునీత మైపాల్. సర్పంచ్ గా గెలుపొందడంతో ఎన్నికల హామీలలో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన బంటు నేహా అనే మైనార్టీ యువతి వివాహం సందర్భంగా ఎన్నికల హామీలలో భాగంగా పెళ్ళికానుక కింద రూ. 6116 ఆర్థిక సహాయంతో పాటు పట్టుచీరను సర్పంచ్ తెలుగు సునీత మహిపాల్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పెళ్లికూతురుకు అందజేశారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా దహన సంస్కార సహాయంగా రూ.6 వేలు అందించే హామీ ఇప్పటికే అమలవుతోంది. ప్రస్తుతం పెళ్ళికానుక కింద ఆర్థిక సహాయం అందించే రెండవ హామీ ఆదివారం ప్రారంభం కావడంతో స్థానిక గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మహిపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తానని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు కృష్ణ, రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు దేవునూరి లక్ష్మి సదానందం, కలపల్లి లక్ష్మి ప్రభు, వని మోహన్, తలారి బాలకృష్ణ, వని రమాదేవి దుర్గేష్, నాయకులు బాల్ రాజ్ ,దుర్గయ్య, నాగభూషణం, గోవర్ధన్, సత్తయ్య, వెంకయ్య, భాగయ్య, ఈశ్వరయ్య, నజీర్, నర్సింలు,రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం పొందుతారు

* **జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం పొందుతారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,మగ్దూంనగర్ లోని మల్లికార్జున స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయంలో కొమురవెల్లి మల్లన్న కళ్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జున స్వామి (మల్లన్న) కృపాకటాక్షాలతో జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు కొలుకుల జైహింద్,నాయకులు బండ మహేందర్,రాయి విగ్నేష్,వినోద్,నాని,చారి,ఆలయ కమిటీ అధ్యక్షులు సుజిత్ కుమార్,ఉపాధ్యక్షులు రాజు,కమిటీ సభ్యులు రాములు,భాస్కర్, దినేష్,విటల్,కిషన్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని బత్తుల శ్రీకాంత్ యాదవ్ ఆవేదన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : గత 15 సంవత్సరాలుగా రాజకీయ రంగంలో ప్రజాసేవ చేస్తున్న తనపై కొంతమంది స్వార్థపరులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ చర్లపల్లి డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు.తాను ఎక్కడా బలవంతపు వసూళ్లకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అలా చేయాల్సిన అవసరం కూడా తనకు లేదని, తమ తండ్రి సరిపడా ఆస్తిని వదిలి వెళ్లారని తెలిపారు. తాను ఒక బీసీ బిడ్డనని, కష్టపడి రాజకీయంగా ఎదుగుతున్నందుకే తనపై ఈర్ష్య, ద్వేషాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చర్లపల్లి డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడిగా, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని, తన సేవలను కుషాయిగూడ ప్రజలు బాగా తెలుసునని అన్నారు. తన దగ్గరికి వచ్చే వారికి అవసరమైన సహాయం చేయడం, మార్గనిర్దేశం చేయడం తప్ప మరేదీ చేయలేదని స్పష్టం చేశారు.కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైన సమయంలో తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, తాను అవినీతిపరుడినైతే ఆ బాధ్యత ఎందుకు ఇస్తారని ప్రశ్నించారు. కొన్ని విధానాలు నచ్చక స్వచ్ఛందంగా సంఘానికి దూరంగా ఉన్నానని తెలిపారు.డివిజన్‌కు కుషాయిగూడ పేరు రావాలని తాను కూడా కోరుకున్నానని, ఆ విషయంలో కార్పొరేటర్‌ను అభ్యర్థించానని చెప్పారు. కుషాయిగూడలో తాను చేసిన పనులు తన ద్వారా లబ్ధిపొందిన వారికి బాగా తెలుసునని అన్నారు. ఒకరిపై ఆరోపణలు చేయడం తేలిక అని, కానీ నిజాయితీగా ప్రజల మధ్య పనిచేయడం కష్టమని వ్యాఖ్యానించారు. తన నిజాయితీని డ్రామాలు చేసే వారికి నిరూపించాల్సిన అవసరం లేదని, తనను నిజంగా తెలిసిన నిస్వార్థ ప్రజలకే తాను సమాధానం చెబుతానని స్పష్టం చేశారు.బీసీలు రాజకీయంగా ఎదుగుతున్నప్పుడు వారిని అణగదొక్కేందుకు కుట్రలు జరుగుతున్నాయని, తన విషయంలో అదే జరుగుతోందని ఆరోపించారు. బీసీ నాయకులు, బీసీ ప్రజలు ఈ కుట్రలను గమనించి న్యాయంగా ఆలోచిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు?

**: ఉత్తమ్**

హైదరాబాద్: పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని తెలంగాణ నీటిపారుదలశాఖ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి కేసీఆర్ చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ స్పందించారు. "పాలమూరు, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజలు కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో అవాస్తవాలు చెప్పడం పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు తగదు. రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చినా.. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు



కూడా పూర్తిచేయలేదు. కృష్ణా జలాలు కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా ముందుకెళ్తోంది. కృష్ణా జలాల విషయంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసింది కేసీఆరే. రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం కేసీఆర్. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇప్పుడు ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నారు. కాళేశ్వరం నిర్మాణ తీరును నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుబట్టారు. కమీషన్ల కోసమే ఆ ప్రాజెక్టు అంచనాలు పెంచారు" అని మంత్రి ఉత్తమ్ విమర్శనాస్త్రాలు సంధించారు.



## కోడలితో అక్రమ సంబంధం.. సుపారి గ్యాంగ్‌తో కుమారుడిని హత్య చేయించిన తండ్రి

కరీంనగర్: కోడలితో ఉన్న అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని తండ్రే.. సుపారీ ఇచ్చి కుమారుడిని హత్య చేయించిన ఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. హత్య అనంతరం మిగిలిన సుపారీ డబ్బుల కోసం నిందితులంతా ఒకే చోటుకు చేరడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన అంజయ్య (36)కు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అంజయ్య తన పొలం పనులు చూసుకుంటూ.. ఉపాధి నిమిత్తం 2017 విదేశాలకు వెళ్లి తిరిగి 2019లో స్వగ్రామానికి వచ్చాడు. ఇంటికి వచ్చినప్పటి నుంచి తండ్రి లచ్చయ్య, తన భార్య సాన్నిహిత్యాన్ని గమనించి అంజయ్య ఇద్దరినీ మందలించాడు. ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించాడు. అయినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. ఇదే విషయాన్ని కొందరి బంధువుల వద్ద చెప్పుకొని బాధపడ్డాడు. అక్రమ సంబంధానికి కుమారుడు అడ్డువస్తున్నాడని భావించిన లచ్చయ్య, కోడలితో కలిసి మూడు నెలల కిందట ఓ మంత్రగాడి వద్దకు వెళ్లి మందు పెట్టి చంపాలని నిర్ణయించుకున్నారు. ఒక వేళ అంజయ్య అనారోగ్యానికి గురైతే అతనికి సేవ చేయాల్సి వస్తుందని భావించి ఆ పథకం విరమించుకున్నారు. నెల రోజుల క్రితం లచ్చయ్య తనకు తెలిసిన మధ్యవర్తి అయిన కొలిపాక రవితో.. అంజయ్యను హత్య చేయాలని చెప్పాడు. రవి తనకు తెలిసిన ఉప్పరపల్లి కోటేశ్వర్, అతని స్నేహితుడు మహ్మద్ అబ్రార్‌తో రూ.3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. వాయిదాల పద్ధతిలో లచ్చయ్య రూ.1.25 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. నెల రోజుల నుంచి కోటేశ్వర్, అబ్రార్‌లు అంజయ్యతో పరిచయం పెంచుకొని రోజూ మద్యం సేవించేవారు. ఈనెల 2న కోటేశ్వర్, అబ్రార్, రవిలు అంజయ్యను ఊరి శివారులోని కెనాల్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. తరువాత గొంతు నులిమి చంపి మృతదేహాన్ని కెనాల్‌లో పడేశారు. అంజయ్య కనిపించడం లేదని భార్య, తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 5న అంజయ్య మృతదేహాన్ని కాలువలో గుర్తించారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయి మృతి చెందినట్టు నిందితులు నమ్మించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. సుపారీ కింద మిగిలిన రూ.1.75లక్షలు తీసుకోవడానికి నిందితులు లచ్చయ్య ఇంటికి రాగా.. పోలీసులు వారి కదలికలను గుర్తించి పట్టుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితులైన తండ్రి లచ్చయ్య, అంజయ్య భార్య, కోటేశ్వర్, అబ్రార్, రవిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

## మెదక్ జిల్లాలో దారుణం.. మూడేళ్ల కుమారుడిని చంపిన తండ్రి

మెదక్ రూరల్: మెదక్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. తనకు పుట్టలేదన్న అనుమానంతో తండ్రే.. కుమారుడిని హత్య చేసిన విషాద ఘటన మెదక్ మండలంలోని పెద్దబాయి తండాలో ఆదివారం చోటు చేసుకుంది. మెదక్ గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దబాయి తండాకు చెందిన బదావత్ భాస్కర్‌కు అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులిద్దరూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య తరచూ కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం భాస్కర్ తన భార్యను కొట్టాడు. దీంతో ఆమె మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. కుమారుడు రెండ్రోజులుగా తండ్రి వద్దే ఉన్నాడు. బాబు తనకు పుట్టలేదనే



అనుమానంతో తాడుతో గొంతు బిగించి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామీణ ఠాణా పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఆరు గ్యారంటీల అమలు పట్టించుకున్నారా?
## సోనియాకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణలో స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు, మేనిఫెస్టో అమలు గురించి ఏనాడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా? అని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి ఆరా తీశారా? అంటూ ఓ బహిరంగ లేఖ రాశారు. "ఆనాడు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టి.. మళ్లీ ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేశారా? ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? గాంధీభవన్‌లో పాతరేశారా? తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. ఇప్పటికైనా కొత్త ఊహలు, కొత్త ఆశలు, కొత్త హామీలు కల్పించే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే మీరు ప్రయోగించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహం రూపంలో మీ పాలిట భస్మాసుర హస్తమై అధికారానికి దూరం చేస్తుంది. తెలంగాణ ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారు" అని కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

## ఆ రెండు పార్టీలు పాలమూరుకు ద్రోహం చేశాయి

**: కేసీఆర్**

హైదరాబాద్: తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు పాలమూరుకు ద్రోహం చేశాయని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా మరోసారి అలాగే వ్యవహరిస్తోందని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణ, ప్రత్యేకించి పాలమూరు పాలిట పెనుశాపంగా మారింది. ఇవాళ్టి సమావేశం ప్రధాన ఎజెండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అంశం. కేంద్రం, రాష్ట్రం.. పాలమూరు ప్రాజెక్టుకు చేసిన ద్రోహంపైనే చర్చ జరిగింది. సమైక్య రాష్ట్రంలో ఎక్కువ అన్యాయానికి గురైన జిల్లా పాలమూరు. ఆ జిల్లా ప్రాజెక్టులకు 174 టీఎంసీలు రావాల్సి ఉంది". "పాలమూరు జిల్లాలో కృష్ణానది 300 కి.మీ ప్రవహిస్తోంది. ఉద్యమ సమయంలో పాలమూరుకు జరిగిన అన్యాయం వివరించా. బచావత్ ట్రైబ్యునల్ పంపకాల్లో పాలమూరు గురించి స్పష్టంగా చెప్పారు. 1974లో బచావత్ ట్రైబ్యునల్ 17 టీఎంసీలు జూరాలకు సుమోటోగా కేటాయించింది. కానీ, బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులను పట్టించుకున్నవారే లేరు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టుల పరిస్థితిపై



పూర్తి అధ్యయనం చేశాం. పాలమూరు జిల్లాకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాం. చంద్రబాబు పెండింగ్ పెట్టిన ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం. భూ గర్భజలాల ద్వారా మరో లక్షన్నర ఎకరాల ఆయకట్టు వచ్చింది. పాలమూరు జిల్లాకు 170 టీఎంసీలు తీసుకెళ్లాలన్నది బీఆర్ఎస్ సర్కారు వ్యూహం.

*** కాంగ్రెస్ ప్రభుత్వం.. సర్వభ్రష్ట ప్రభుత్వం**

"పాలమూరు జిల్లాలో చెరువుల లెక్కలు తీసి కేంద్రానికి సమర్పించాం. చంద్రబాబు మాటలు విని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. భాజపా ప్రభుత్వం మొదటి నుంచి మాకు శనిలా దాపురించింది. ఎంత దద్దమ్మ ప్రభుత్వం అయినా పాత ప్రాజెక్టులను కొనసాగించాలి కదా. రెండేళ్లయినా పాలమూరు ప్రాజెక్టులో తట్టెడు మట్టయినా తీయలేదు. ఎంత సేపూ భూములు అమ్ముకుందామనే యావలోనే ఉంటే ఎలా? రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని ఇదేమి దద్దమ్మ ప్రభుత్వం. కేవలం 40 టీఎంసీలు చాలని కేంద్రానికి ఎలా లేఖ రాస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల మధ్య ఎండగడతాం. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం. భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం.. సభలకు నేనూ వస్తా. ఈ ప్రభుత్వానికి కావాల్సినంత సమయం ఇచ్చాం. ఇకపై మౌనంగా ఉండేది లేదు.. పాలమూరుపై కేంద్రాన్ని ఎండగడతాం.. పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నోరుమూసుకుని ఉంటే.. మేమైనా పూనుకోవాలి కదా. కళ్లముందే ఇంత మోసం జరుగుతుంటే కేసీఆర్ మౌనంగా ఉంటారా? అందుకే నేనే స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నా. ఇవాళ్టి వరకూ ఒక కథ..రేపటి నుంచి మరో కథ. తెలంగాణ కోసం ఎందాకైనా పోరాడతాం.. ఎలాంటి మొహమాటాలు ఉండవు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. సర్వభ్రష్ట ప్రభుత్వం" అని కేసీఆర్ విమర్శించారు.

## క్రోమ్, వాట్సప్ యూజర్లకు 'సైబర్ భద్రత'పై హెచ్చరిక!

గూగుల్ క్రోమ్ బ్రౌజర్ లోపాలు, వాట్సప్ ఖాతా టేకోవర్ వంటి పద్ధతుల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజల్ని లక్ష్యంగా చేసుకొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇవి డేటా చౌర్యం, ఆర్థిక నష్టానికి దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ శిఖా గోయెల్ హెచ్చరించారు. వినియోగదారులు తమ యాప్‌లను అప్‌డేట్ చేయాలని, ఓటీపీలు లేదా వెరిఫికేషన్ కోడ్‌లను ఎవరికీ షేర్ చేయొద్దని సూచించారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే 1930కు కాల్ చేయడం లేదా http://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేస్తూ టీజీసీఎస్‌బీ వేదికగా 'ఎక్స్'లో పెట్టిన పోస్టులో ఆమె పేర్కొన్నారు. ఏ రకంగా దాడికి పాల్పడతారు? ఏం చేయాలి తదితర అంశాలను అందులో వివరించారు.

**ఈ దాడి ఎలా జరగొచ్చు?**

క్రోమ్ దాడి: మీరు హానికరమైన వెబ్‌లింక్/URL ఓపెన్ చేస్తే క్రోమ్‌లో ఉన్న లోపం ద్వారా దుర్వినియోగం జరగవచ్చు. మీ బ్రౌజర్ డేటా, సేవ్ చేసిన పాస్‌వర్డ్స్ డేటా అనధికారికంగా లభిస్తాయి. వాట్సప్ టేకోవర్ (ఘోస్ట్ పెయిరింగ్ అటాక్) ద్వారా.. ఫేస్‌బుక్ ఫొటో ట్యాగ్ ద్వారా లేదా ఆఫర్లు, హెచ్చరిక ద్వారా గానీ నకిలీ లింక్/మెసేజ్ వస్తుంది. అలా వచ్చిన లింకును నిజమైందేనని మీరు భావించి వాట్సప్ వెరిఫికేషన్/పెయిరింగ్ కోడ్ నమోదు చేస్తే.. నేరస్థులు తమ డివైజ్‌ను లింక్డ్ డివైజెస్ ద్వారా జత చేస్తారు. మీ వాట్సప్ పనిచేస్తూనే ఉంటుంది. నేరగాళ్లు కూడా మీ వాట్సప్ చాట్‌ను గమనిస్తుంటారు. ఏం చేయాలి? మీ ఖాతా నేరస్థుడి పర్యవేక్షణలో ఉందని అనుమానం వస్తే.. సంబంధిత యాప్/బ్రౌజర్‌ని వాడటం వెంటనే ఆపేయండి. అన్ని ఆధారాలనూ భద్రపరుచుకోండి. మెసేజ్‌లు, లింక్‌లు, పాప్ అప్స్‌ని స్క్రీన్‌షాట్‌లు తీసుకోండి. ట్రాన్సాక్షన్ ఐడీలు, యూటీఆర్ నంబర్లు, కాల్ లాగ్స్ సేవ్ చేయండి. వాట్సప్‌లో లింక్డ్ డివైజెస్ చెక్ చేసుకోండి. ఒకవేళ తెలియని డివైజ్‌లతో లింక్ అయి ఉంటే వెంటనే తొలగించండి.గూగుల్ క్రోమ్‌ను లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేయండి. ఈమెయిల్, బ్యాంకింగ్, సోషల్ మీడియా పాస్‌వర్డ్స్ మార్చుకోండి. ఒకవేళ నగదు సంబంధిత లావాదేవీలు జరిగితే మీ బ్యాంకు/పేమెంట్ యాప్‌నకు సమాచారం



ఇవ్వండి

**జాగ్రత్తలివీ..**

క్రోమ్, అన్ని యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయండి. ఓటీపీ, పిన్, సీవీవీ, వాట్సప్ కోడ్‌లను ఎవరికీ చెప్పొద్దు. తెలియని లేదా అత్యవసరంగా అనిపించే లింక్‌లపై క్లిక్ చేయొద్దు. వాట్సప్‌లో టూ స్టెప్ వెరిఫికేషన్ ప్రారంభించండి. తెలియని వెబ్‌సైట్లలో లాగిన్ కావొద్దు.

## తదుపరి ఎస్ఐఆర్ తెలంగాణలోనే: సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

హైదరాబాద్: బిహార్‌లో బీఎల్‌వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను విజయవంతంగా నిర్వహించి దేశానికి మార్గదర్శనం చేశారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. తెలిపారు. తదుపరి అదే పక్రియ తెలంగాణలో అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించారు. ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి భారత కేంద్ర ఎన్నికల సంఘం ఎదిగిందని.. రాబోయే ఒక సంవత్సరం పాటు అంతర్జాతీయ 'ఇంటర్నేషనల్ ఐడియా' సంస్థకు కేంద్ర ఎన్నికల కమిషనరే నాయకత్వం వహించనున్నారని వెల్లడించారు. కెనడా దేశం కంటే తెలంగాణలోనే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని, .అంత పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్న




రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత BLOలపై ఉందని తెలిపారు. దేశంలో ఎన్నికల నిర్వహణ కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల యంత్రాంగమని పేర్కొన్నారు. బిహార్‌లో ఎన్నికలను 7 దేశాల నుంచి వచ్చిన 20 మంది ప్రతినిధులు పరిశీలించారని, అంతర్జాతీయంగా భారత ఎన్నికల వ్యవస్థకు గుర్తింపు లభించిందని చెప్పారు. ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత 7.5 కోట్ల ఓటర్లతో జాబితా విడుదల చేశామని, ఈ ప్రక్రియపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తెలిపారు. ఎన్నికల అనంతరం రికౌంటింగ్ విషయంలో కూడా సున్నా ఫిర్యాదులే వచ్చాయని, దానికి కారణం BLOల సమర్థ పనితీరేనని ప్రశంసించారు. తెలంగాణలోఒక BLOకి సగటున 930 మంది ఓటర్లు ఉన్నారని..SIR సమయంలో చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు వంటి లోపాలు బయటపడతాయన్నారు. అలాంటి లోపాలను సరిచేయడానికే SIR అవసరమని వివరించారు. దేశ రాజ్యాంగానికి అతిపెద్ద సైనికులు బూత్ లెవెల్ ఆఫీసర్లేనని.. ప్రస్తుతం దేశంలో 12 రాష్ట్రాల్లో SIR కొనసాగుతోందని, భవిష్యత్తులో మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో SIRను అందరం కలిసి విజయవంతం చేద్దాం అంటూ BLOలకు జ్ఞానేశ్ కుమార్ పిలుపునిచ్చారు.

## కేసీఆర్ ఇప్పటికైనా బయటికొచ్చారు... సంతోషం!: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రెస్ మీట్ పై స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడిన ఆయన, కేసీఆర్ మళ్లీ ప్రజల ముందుకు రావడం సంతోషకరమని, ఆయన అసెంబ్లీకి వచ్చి పాలనపై చర్చించాలని సూచించారు. నీటి వాటాల విషయంలో కేసీఆర్ హయాంలోనే రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "811 టీఎంసీల నికర జలాల్లో మనకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసి, మూడు జిల్లాలకు కేసీఆరే మరణశాసనం రాశారు" అని తీవ్రంగా విమర్శించారు. ఏపీ జలదోపిడీకి కేసీఆర్ సహకరించారని, తాము 71 శాతం వాటా కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. జనవరి 2 నుంచి కృష్ణా, గోదావరి జలాల వాటాపై అసెంబ్లీలో చర్చిద్దామని ప్రతిపాదించారు. "మీ పాలన, మా పాలనపై చర్చిద్దామంటే కేసీఆర్ ముఖం చాటేస్తున్నారు. ఆయన అసెంబ్లీకి రావాలి, ఆయన గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లదు" అని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల విషయంలో ఎన్‌డీఎస్ఏ సూచనలు, నిపుణుల కమిటీ సలహాల మేరకే ముందుకెళ్తున్నామని సీఎం స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ నేతలకు అనుమానాలుంటే, నిజనిర్ధారణ కమిటీని వేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# ఆ యుద్ధంలో పోరాడిన బెటాలియన్.. ఇప్పుడు త్రిపురలో ఉంది - సీఎం సాహా



బంగ్లాదేశ్‌లో ఇటీవల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఈశాన్య రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. తాజా పరిణామాలపై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా కీలక వ్యాఖ్యలు చేశారు. 1971లో భారత్‌పాక్ యుద్ధంలో పోరాడిన సైనిక బెటాలియన్‌ను ఈశాన్య రాష్ట్రంలో మోహరించామన్నారు. భాజపా లీగల్ సెల్ అగర్తలాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సాహా ఈ విధంగా మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలు, వాటి ప్రభావం దిల్లీపై పడే అవకాశమున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నివేదికలను పంపిస్తున్నానని త్రిపుర సీఎం పేర్కొన్నారు. ముక్తి వాహిని (బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించిన సాయుధ గెరిల్లా దళం)కి శిక్షణ ఇచ్చి, 1971 యుద్ధంలో పాల్గొన్న భారత సైన్యానికి చెందిన అదే బెటాలియన్ ఇప్పుడు రాష్ట్రంలో ఉందన్నారు. ''అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఆర్మీ లేదని ప్రజలు అంటున్నారు. ఈ రోజుల్లో యుద్ధం చేసేందుకు భౌతికంగా అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. శత్రువులను మట్టుపెట్టడానికి ఒక్క మీట నొక్కితే చాలని ఆపరేషన్ సిందూర్ నిరూపించింది. షేక్ హసీనా దేశం విడిచిన తర్వాత అక్కడి పోలీసులు, ఆర్మీ మౌనంగా ఉండిపోగా.. వేలాది మంది ఫండమెంటలిస్టులు, నేరస్థులు, చోరీలకు పాల్పడిన వారు జైళ్లనుంచి బయటకు వచ్చారు. భారత్ ఎదుగుదలను ఓర్వలేని కొన్ని శక్తులు తాత్కాలిక సారథిని నియమించాయి'' అని మాణిక్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అస్థిరతకు పాకిస్థాన్ ప్రేరేపణలే కారణమన్నారు. 1971 యుద్ధం సమయంలో భారత సైన్యంలోని పర్వత ప్రాంత విభాగాలు కీలక పాత్ర పోషించాయి. దాదాపు 20 పర్వత విభాగాలతోపాటు 8, 6, 4వ డివిజన్లు నాటి తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో ముఖ్య భూమిక వహించాయి.

## ధ్యానం అంటే ఏంటి?
# అది మనకు అపరిచితమా?

**: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ప్రత్యేక వ్యాసం**



చలనం నుంచి నిశ్చలతకు.. శబ్దం నుంచి నిశ్శబ్దానికి చేసే ప్రయాణమే ధ్యానం. ధ్యానం చేయాలనే ఆశయం ప్రతి మనిషిలో ఉంటుంది. ఎందుకంటే ఎన్నటికీ తరిగిపోని ఆనందాన్ని, వక్రీకరించని ప్రేమను, ప్రతికూల భావోద్వేగాలుగా మారని శుద్ధమైన అనుభూతిని కోరుకోవడం అనేది మానవ జీవన స్వభావం.

**ధ్యానం మనకు అపరిచితమా?**

అస్సలు కాదు.. మీరు పుట్టకముందే కొన్ని నెలలపాటు ధ్యానంలోనే గడిపారు. మీ తల్లి గర్భంలో మీరు ఏమీ చేయకుండా ఉండేవారు. ఆహారం నమలాల్సిన అవసరం కూడా లేదు. అది నేరుగా మీకు అందేది. ద్రవంలో తేలుతూ, కొన్నిసార్లు కదులుతూ, ఎక్కువ సమయం ప్రశాంతంగా తేలియాడుతూ ఉండేవారు. అదే ధ్యానం..అదే సంపూర్ణ సౌకర్య స్థితి. అందుకే ప్రతి మనిషిలో, ప్రతి ఆత్మలో, ఆ సంపూర్ణ సుఖస్థితిని మళ్లీ అనుభవించాలనే కోరిక సహజంగానే ఉంటుంది. మీ అసలైన స్వాభావికమైన ఆ ప్రశాంతతకు తిరిగి చేరడమే ధ్యానం.

* పూర్ణ ఆనందమే ధ్యానం.
* ఉత్కంఠ లేని సంతోషమే ధ్యానం.
* ఆందోళన లేని ఉత్సాహమే ధ్యానం.
* ద్వేషం లేదా వక్రీకరణ లేని ప్రేమే ధ్యానం.
* కలత లేని మనసే ధ్యానం.
* ప్రస్తుత క్షణంలో ఉన్న మనసే ధ్యానం.
* సంకోచం లేని, అంచనాలు లేని మనసే ధ్యానం.
* తన మూలానికి తిరిగి వచ్చిన మనసే ధ్యానం.

ధ్యానం అంటే భవిష్యత్తుకోసం వేసే అన్ని ప్రణాళికలను వదిలేయడం. అతిగా ప్రణాళికలు వేస్తుంటే అవి మనల్ని మనలోనికి లోతుగా ప్రవేశించకుండా అడ్డుకుంటాయి. కోరికలు వచ్చినప్పుడు వాటిని పట్టుకోకుండా, కలలుగా మార్చకుండా, వాటిని అర్పించాలి. ధ్యానం అంటే ఈ క్షణాన్ని అంగీకరించడం, ప్రతి క్షణాన్నీ సంపూర్ణతతో జీవించడం. కేవలం ఈ అవగాహన మాత్రమే కాకుండా, కొన్ని రోజులు నిరంతరంగా ధ్యానం చేయడం ద్వారా కూడా మీ జీవన నాణ్యత పూర్తిగా మారిపోతుంది.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
# విట్- భోపాల్ 'కాలేజీ చలో అభియాన్'




సెహోర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం విట్ భోపాల్ యూనివర్సిటీ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'కాలేజీ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించింది. 12వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించి 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశ ప్రక్రియ, వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు, స్కాలర్‌షిప్‌లకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థుల్లో తలెత్తిన సందేహాలను యూనివర్సిటీ అధ్యాపకులు నివృత్తి చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, ఉన్నత విద్యనభ్యసించాలనే విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.




## ఆ వార్తలు అవాస్తవం..
## బంగ్లా హైకమిషన్ వద్ద నిరసనలపై విదేశాంగ శాఖ

దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వెలుపల జరిగిన నిరసనల్లో ఎటువంటి భద్రతా లోపం తలెత్తలేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ బయట ఉన్న కంచెలను ఆందోళనకారులు ధ్వంసం చేసి, లోపలికి చొరబడడానికి ప్రయత్నాలు చేసినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తమని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా అక్కడి మీడియా అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. బంగ్లా హైకమిషన్ వద్ద ఎవరూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదన్నారు. బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్ అనే మైనారిటీ యువకుడి హత్యకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ముందు దాదాపు 2025 మంది యువకులు గుమిగూడి శాంతియుతంగా నినాదాలు చేసినట్లు రణధీర్ పేర్కొన్నారు. కొన్ని నిమిషాల తర్వాత అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వారిని చెదరగొట్టారన్నారు. అయితే వారు అక్కడి నిబంధనలు ఉల్లంఘించడానికి, కంచెను దాటడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్య ఆధారాలు సోషల్ మీడియాలో అందరికీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# దిల్లీలో పొగమంచు ఎఫెక్ట్.. 110 విమానాలు రద్దు.. 370 సర్వీసులు ఆలస్యం

ఉత్తరాది రాష్ట్రాల్లో పొగ మంచు తీవ్రత కొనసాగుతోంది. తీవ్ర మంచుతో జనజీవనానికి ఆటంకం ఏర్పడుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా దేశ రాజధానిలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆదివారం 110 విమాన సర్వీసులు రద్దవ్వగా, వందలాది సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు దిల్లీ విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఫ్లైట్‌రాడార్24 గణాంకాల ప్రకారం.. దిల్లీకి రాకపోకలు సాగించే 370 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి బయలుదేరే విమానాలు సగటున 26 నిమిషాలు ఆలస్యమవుతున్నట్లు అంచనా. అంతరాయం కలుగుతున్నప్పటికీ విమాన కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నాయని దిల్లీ ఎయిర్‌పోర్టు పేర్కొంది. విమాన సర్వీసులకు సంబంధించి ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తోంది. దిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి నిత్యం దాదాపు 1300 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దిల్లీతోపాటు ఉత్తరాది నగరాల్లోనూ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రతికూల వాతావరణంతో అనేక రైలు సర్వీసులు ఆలస్యంగా



నడుస్తున్నాయి. మరోవైపు, దేశ రాజధానిలో గాలినాణ్యత ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. నగరంలోని 16 పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ అత్యంత తీవ్రంగా ఉండగా.. మిగతా ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్నట్లు సమాచారం.

# నాయకత్వ మార్పు అంశం.. హైకమాండ్‌పై నిందలా? ఖర్గే

కర్ణాటకలో నాయకత్వ మార్పుపై గత కొన్ని రోజులుగా జోరుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై హైకమాండ్ ఎలాంటి గందరగోళం సృష్టించలేదని, స్థానిక స్థాయిలోనే సమస్య ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానంపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కలబురగిలో విలేకరులతో మాట్లాడుతూ.. హై కమాండ్‌పై నిందలు వేయడం కంటే అంతర్గత వివాదాలకు స్థానిక నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల్లో తమ వల్లే పార్టీ విజయం సాధించిందని కొందరు



ప్రకటించుకోవడంపై ఖర్గే సీరియస్ అయ్యారు. ''పార్టీ నిర్మాణంలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉంది. ఒక్కరి కృషి వల్లే జరగలేదు. కార్యకర్తలే మనకు మద్దతుగా నిలిచారు'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. నాయకులు వ్యక్తిగతంగా గొప్పలు చెప్పుకోవడం మానేసి కార్యకర్తల సమష్టి కృషిని గుర్తించాలన్నారు. పార్టీ అధిష్ఠానాన్ని కలిసేందుకు డీకే శివకుమార్ దిల్లీ వెళ్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఈ విషయంపై తనకు సమాచారం లేదన్నారు. సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల మధ్య అధికార పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంలో పార్టీ హైకమాండ్ తనకు మద్దతుగా నిలుస్తుందన్న విశ్వాసం ఉందని సిద్ధరామయ్య పేర్కొనడం, మరోవైపు డీకే కూడా దిల్లీ పర్యటనకు సిద్ధమైన వేళ ఖర్గే వ్యాఖ్యలు కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఆర్మీకి 'అశనీ దళం' వెన్నుదన్ను.. సైన్యం చేతికి మట్టి అంటకుండా..!

భారత అమ్ముల పొదిలోకి మరిన్ని అధునాతన సాంకేతిక ఆయుధాలు చేరనున్నాయి. 850 ఆత్మాహుతి డ్రోన్ల (కామికాజి) కొనుగోలు ప్రక్రియ తుదిదశలో ఉంది. డిసెంబర్ చివరి వారంలో జరగనున్న రక్షణ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో.. భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికను అందిపుచ్చుకుంటూ ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. కేవలం ఆర్మీలోనే కాకుండా నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోనూ ఈ తరహా డ్రోన్ల వాడకాన్ని మరింత పెంచుకోవాలన్న లక్ష్యంతో మొత్తం 30 వేల డ్రోన్లను సమకూర్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే తొలి విడతగా 850 డ్రోన్ల కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది.

**ఏంటీ ఆత్మాహుతి డ్రోన్లు?**

ఈ ఆత్మాహుతి డ్రోన్లను నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ అభివృద్ధి చేస్తోంది. వెయ్యి కిలోమీటర్ల దాకా ఎగరగలవు. రాడార్ల కళ్లుగప్పి.. లక్ష్యాలను ఛేదించగలవు. రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇలాంటి డ్రోన్లను వినియోగిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, దాని మిత్రదేశాల నౌకా దళాలపై దాడులకు జపాన్ తన యుద్ధవిమానాలను ఆత్మాహుతి దాడులకు వాడింది. వారిని కామికాజి ఆత్మాహుతి దళాలుగా పిలిచేవారు. ఈ తరహాలోనే డ్రోన్‌లు పనిచేయనున్నాయి.

*** ఆర్మీకి వెన్నుదన్నుగా అశనీ దళం!**

భారత పదాతి దళం ఈ రకం డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలని భావిస్తోంది. క్రమంగా వీటిని ఎయిర్‌ఫోర్స్, నేవీలోనూ వినియోగించేందుకు అవకాశాలను పరిశీలిస్తోంది. అయితే వీటిని ఒక్కొక్కటిగా ప్రయోగిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. ఒక్కో



ప్లాటూన్‌లో కనీసం 10 డ్రోన్లు ఉంటాయి. దీనిని అశనీ దళంగా ఆర్మీ చెబుతోంది. వీటన్నింటినీ ఒకేసారి గుంపుగా ప్రయోగిస్తారు. వీటిలో కొన్ని నిఘా కోసం పని చేయగా.. మిగతా డ్రోన్లు శత్రు లక్ష్యాలను ఛేదిస్తాయి. పేలుడు పదార్థాలు మోసుకెళ్తున్న డ్రోన్లు.. శత్రు రాడార్లకు దొరక్కుండా నిఘా డ్రోన్లు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తాయి. సరైన అవకాశం లభించే వరకు వేచి చూసి దాడి చేయడం ఈ డ్రోన్ల ప్రత్యేకత. వీటి పని తీరును తెలుసుకునేందుకు అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ సెక్టార్‌లో సైన్యం ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరిశీలించింది.

**ఆపరేషన్ సిందూర్ ప్రేరణగా..**

ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. క్షిపణులతో పాక్ భూభాగంపై విరుచుకుపడింది. పలు స్థావరాలను నేలమట్టం చేసింది. దాడికి పాల్పడినట్లు భావించిన 9 మంది ఉగ్రవాదుల్లో ఏడుగురిని ఒకే రోజు హతమార్చింది. భారత్‌ను అడ్డుకునే సత్తా లేని పాకిస్థాన్.. సామాన్యులే లక్ష్యంగా పెద్ద సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. వీటిని భారత్ సమర్థంగా అడ్డుకున్నప్పటికీ.. భవిష్యత్‌లో వాటి ముప్పును అధిగమించేందుకు వీలుగా డ్రోన్ శక్తిని గణనీయంగా పెంచుకుంటోంది.

# 'వీబీ-జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీజీ రామ్ జీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 100 రోజుల పని హామీ కల్పించిన మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) స్థానంలో దీనిని తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన శీతాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనల నడుమే ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందింది. తగినంత సమయం ఇవ్వకుండా హడావుడిగా బిల్లులకు ఆమోదం తెలపడం అప్రజాస్వామికమంటూ విపక్షాలు ఉభయసభల్లోనూ నిరసన తెలిపాయి. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా) చట్టాన్ని రద్దుచేయడం సరికాదంటూ ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి బిల్లు ప్రతుల్ని చించి విసిరేశాయి. రూ.10-11 లక్షల కోట్లను కేవలం కూలీలకిచ్చే వేతనాలపై ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారుచేశామని కేంద్ర మంత్రి చౌహాన్ విపక్షాలకు వివరణ ఇచ్చారు.

# దుబాయ్‌లో ఘనంగా ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకావిష్కరణ

నేటి యువత దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, పోరాట పటిమతో జీవితంలో ముందుకు సాగాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి టి.డి. జనార్దన్ అన్నారు. దుబాయ్‌లో నిర్వహించిన తెలుగు వారి ఆత్మీయ సమావేశంలో 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీ జనార్దన్ మాట్లాడుతూ ఆంధ్రదేశానికి ఎంతోమంది ముఖ్యమంత్రులు పాలించినా అందరికి గుర్తుండిపోయేది ఒక్క ఎన్టీఆర్ మాత్రమేనని అన్నారు. తెలుగునాట రాజకీయాల్లో ఎన్టీఆర్ ముందు ఎన్టీఆర్ తర్వాత అన్నట్టుగా పాలనా సాగిందని చెప్పారు. ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని తాము ఎన్టీఆర్ సిద్ధాంతాలను, ఎన్టీఆర్ భావజాలాన్ని ముందుతరానికి, తర్వాత తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతో కమిటీ ఏర్పాటు చేశామని, అందరి సహకార సమన్వయంతో ఎన్టీఆర్‌పై పలు పుస్తకాలు వెలువరిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా అన్న ఎన్టీఆర్ యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని, ఎన్టీఆర్ పేరుని అజరామరం చేయడమే తన లక్ష్యమని జనార్దన్ పేర్కొన్నారు.



## జగన్‌కు చంద్రబాబు, పవన్, షర్మిల బర్త్‌డే విషెస్



అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''జగన్‌కు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకర జీవితాన్ని భగవంతుడు ప్రసాదించాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు. ''జగన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, సుఖసంతోషాలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను'' అని పవన్ పోస్ట్ చేశారు. జగన్‌కు దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు షర్మిల పేర్కొన్నారు. జగన్‌కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగన్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో, ప్రజాసేవలో కొనసాగాలన్నారు.

## రిటైర్డ్ అయినా వదలం
## ఇరిగేషన్ అధికారులకు మాజీ మంత్రి వార్నింగ్



ఇరిగేషన్ అధికారుల పై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అండతో ఇరిగేషన్ విభాగం ఎస్ఈ దేశీనాయక్, మేనేజర్ గంగాధర్ రెడ్డి అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే తప్పు చేసిన అధికారులను విడిచిపెట్టమని హెచ్చరించారు. ఉద్యోగులు రిటైర్డ్ అయినా వదలిపెట్టమమని, వాళ్ల లెక్కలన్నీ సరి చేయిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఆస్తులు మొత్తం అమ్మించి అవినీతిని కక్కిస్తామని కాకాణి వ్యాఖ్యానించారు. అయితే వైసీపీ హయంలో ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతిని ఇటీవల సోమిరెడ్డి చంద్రబాబు మోహన్ రెడ్డి బయటపట్టారని, పనుల చేయకుండానే కాకాణి గోవర్ధన్ రెడ్డి బిల్లులు రూపంలో కోట్లు తీసుకున్నారని స్థానికులు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖలో జరిగిన రూ. 150 కోట్ల అవినీతికి సంబంధించిన ఆధారాలను సోమిరెడ్డిని బయటపెట్టారని, అందువల్లే కాకాణి గోవర్ధన్ రెడ్డి అధికారులపై రెచ్చిపోతున్నారని టీడీపీ నేతలు విమర్శలు చేశారు.

## నాకు పునర్జన్మ ఇచ్చారు.. జీవితాంతం రుణపడి ఉంటా

**: పవన్ కల్యాణ్**



నాకు పునర్జన్మను ప్రసాదించి, అడుగడుగునా ధైర్యం, బలం అందిస్తూ నన్ను నడిపిస్తున్న నా ఇష్టదైవం కొండగట్టు అంజన్న స్వామి వారి సన్నిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కల్పించినందుకు స్వామివారికి మనస్ఫూర్తిగా ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కొండగట్టు దేవాలయ అభివృద్ధి కోసం ప్రతిపాదన చేయగానే ముందుకు వచ్చి నిధులు మంజూరు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, అలాగే తిరుమల శ్రీవారి భక్తులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధుల ద్వారా కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కలగాలని, స్వామివారి కృపతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాగా, కొండగట్టు అంజన్న ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 35.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. భక్తుల సౌకర్యార్థం వంద గదుల ధర్మశాల, దీక్షామండపం నిర్మించనున్నారు.



## కర్నూలు జిల్లా టీడీపీ అధ్యకురాలిగా గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలిగా ఆధికృష్ణమ్మను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించించింది. ఈ మేరకు ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి కృష్ణమ్మను జిల్లా పగ్గాలు అందించినట్టు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కృష్ణమ్మ నివాసానికి చేరుకుని కృష్ణమకు పార్టీ క్యాడర్, కూటమి నాయకులు, ఎమ్మెల్యే పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఒక BC మహిళగా రాజకీయ చదరంగం, రణరంగంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాని తెలిపారు. సేవే లక్ష్యం, ప్రేమే మార్గంగా జిల్లాలో ఆమె పని చేశారన్నారు. ప్రజలపై కృష్ణమ్మకు ఉన్న అంకిత భవానికి అధిష్టానం ఆమెకు కర్నూలు జిల్లా పట్టంకట్టిందని చెప్పారు. కృష్ణమ్మ రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు .

## త్వరలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు





తిరుమల లో భద్రతపై టీటీడీ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా ఘాట్ రోడ్లలోనూ తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రమాదాల నివారణ, వాహనాల భద్రతపై చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. ఈ మేరకు పోలీసులకు 20 బ్రీత్ ఎనలైజర్లను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అందజేశారు. టీటీడీ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తుల భద్రతను అధిక ప్రాధాన్యతమిస్తున్నామని తెలిపారు. ఘాట్ రోడ్లలో పటిష్ట భద్రత కోసం రూ.8 లక్షల విలువైన బ్రీత్ ఎనలైజర్లను పోలీసు యంత్రానికి అంజేసినట్లు పేర్కొన్నారు. భక్తుల భద్రతకు అత్యాధునికి పరికాలను సైతం అందిస్తామని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. కాగా ఇటీవల కాలంలో అరిపిరి, తిరుమలలో మద్యం, నాన్ వెజ్ కలకలం రేపాయి. శ్రీవారం ఆలయం సమీపంలో భక్తులు ఎగ్ బిర్యానీ తిన్నారు. అలాగే కొందరు యువకులు మద్యం మద్యం మత్తులో హల్ చల్ చేశారు. దీంతో తిరుమలలో భద్రతపై విమర్శలు కురిశాయి. ఈ మేరకు అలిపిరి రోడ్డు మార్గంతో పాటు తిరుమలలోనూ పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ యంత్రానికి ఈవో అనిల్ కుమార్ 20 బ్రీత్ ఎనలైజర్లను అందజేశారు.



## 43 మంది రైతులను ముంచి.. పరార్

43 మంది రైతులను ముంచి పరారయిన మరో రైతు ఉదంతం అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌లో జరిగింది. ధర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు మనోహర్ కొన్నేళ్లుగా వ్యవసాయం సాగు చేశారు. స్థానికంగా ఉన్న రైతులతో పరిచయాలు పెంచుకున్నారు. అలా వ్యవసాయం పెట్టుబడి కోసం 43 మంది రైతులు, వ్యవసాయ కూలీలను నమ్మించి రూ. 40.85 లక్షలు అప్పుగా తీసుకున్నారు. వ్యవసాయం చేశారు. నష్టాలు వచ్చాయని చెప్పి ఉన్న ఇంటి, తన నాలుగు ఎకరాల పొలాన్ని అమ్మాడు. దీంతో తమకు ఎప్పుడు ఇస్తావని రైతులు నిలదీశారు. అప్పు తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నానని, ఐపీ పెట్టి నోటీసులు ఇచ్చారు. దీంతో బాధిత రైతులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించడంతో అప్పు తీర్చుతానంటూ నమ్మబలికాడు. ఆ తర్వాత ఊరి నుంచి వెళ్లిపోయారు. దీంతో 43 మంది బాధిత రైతులు, వ్యవసాయ కూలీలు లబోదిబోమంటున్నారు.

## మంత్రి నారా లోకేశ్ ఎమోషనల్ ట్వీట్



తన భార్య నారా బ్రాహ్మణి జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. తన సతీమణి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎక్స్ వేదికగా శుభాకాంక్షలను తెలియజేశారు. తనకు వెన్నుదన్నుగా ఉంటూ వెన్నంటి నడిచే జీవిత భాగస్వామిని కొనియాడుతూ తన ఖాతాలో పోస్ట్ చేశారు. దైవ దర్శనం అనంతరం నది తీరంలో దిగిన ఫోటోను పోస్టుకు అనుబంధంగా అప్ లోడ్ చేశారు. హ్యాపీ బర్త్ డే బ్రాహ్మణి.. కష్టాల్లోనూ, సుఖాల్లోనూ, ప్రశాంతతలోనూ, గందరగోళంలోనూ నువ్వు నాకు ఎప్పుడూ అండగా ఉన్నావు. దేవాన్ష్ కు ప్రియమైన తల్లివి నువ్వు, ఒక రాక్ స్టార్ సీఈఓవి కూడా, ప్రతి అడుగులో నా తోడుగా నడుస్తున్నావు. నీకు ఎప్పటికీ నేను కృతజ్ఞుడిని. అని తన పోస్టులో పేర్కొన్నారు. ఎంతో లోతైన భావంతో నారా లోకేశ్ పోస్ట్ చేయడంతో అందరూ మంత్రిలోని మరో కోణాన్ని చూస్తున్నాం అంటున్నారు. భార్యపైన ఇంతటి ప్రేమ ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం తండ్రి సీఎం చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నారా లోకేశ్ నడుస్తున్నారని.. ఆయనకు వెన్నంటి ఉండి కొండంత బలాన్నిస్తున్న నారా బ్రాహ్మణి అమ్మ నిండు నూరేళ్లు చల్లంగా ఉండాలని టీడీపీ శ్రేణులు, అభిమానులు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. జీవితంలో వారు మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

## దేవుడి ఆలయానికి వెళ్తే.. తీవ్ర విషాదం



దేవుడి ఆలయానికి వెళ్లిన కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో జరిగింది. బాలురులు ధనుష్, పవన్ సాయితో కలిసి తల్లిదండ్రులు ఆముదాలవలస ఉమారామలింగేశ్వర ఆలయం వద్దకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకోవాలని అనుకున్నారు. అయితే పుష్కరిణిలో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ధనుష్, పవన్ సాయి నీటిలో గల్లంతయ్యారు. కొద్దిసేపటికే నీటిలో మునిగిపోయారు. పిల్లలను రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఇద్దరూ మృతి చెందారు. దీంతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి.

# సినిమా

# బ్యానర్ మారింది!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం పవన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దానయ్య ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా టార్గెట్‌గా నిర్మించాడు. ఇక ఈ సినిమా సక్సెస్ మీట్‌లో ఓజీ 2 ఉంటుందని హీరో స్వయంగా ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. దీంతో అప్పటి నుంచి ఈ సీక్వెల్ ఎప్పుడు ప్రారంభమవుతుంది? పవన్ కళ్యాణ్ లుక్ ఎలా ఉండబోతోంది? కథ ఏ స్థాయిలో ఉంటుందన్న చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగాయి. అయితే ఈ సీక్వెల్ నిర్మాణం నుంచి డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తప్పుకున్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను యూవీ ప్రొడక్షన్స్ చేపట్టే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



MOVIE TIME

# నేను క్షేమము

బాలీవుడ్ సెన్సేషనల్ డ్యాన్సర్, నటి నోరా ఫతేహి పెను ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడింది. ముంబైలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రయాణిస్తున్న కారు తీవ్రంగా దెబ్బతింది. ప్రముఖ అమెరికన్ డీజే డేవిడ్ గెట్టా 'సన్బర్న్' సంగీత కచేరీకి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఒక డ్రైవర్ వేగంగా వచ్చి ఆమె కారును ఢీకొట్టాడు. వెంటనే ఆమె సిబ్బంది అప్రమత్తమై సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం లేదని, స్వల్ప కంకషన్ మాత్రమేనని నిర్ధారించారు. విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించినప్పటికీ, ఆమె మాత్రం సన్బర్న్ 2025 వేదికపై ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ విషయంపై సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ ప్రస్తుతం తాను బాగానే ఉన్నట్లు వెల్లడించింది. అలాగే ప్రమాదం ఎలా జరిగిందో వివరించింది. ప్రస్తుతం నోరా చేతిలో 'కాంచన 4', 'కేడీ: ది డెవిల్' వంటి భారీ సౌత్ ప్రాజెక్టుల తో పాటు ఇషాన్ ఖట్టర్‌తో కలిసి చేస్తున్న 'ది రాయల్స్' అనే వెబ్ సిరీస్ కూడా ఉంది.





# కిల్లర్ లుక్స్

కొరియోగ్రాఫర్ కం నటి ధనశ్రీ ఫ్యాషన్ సెన్స్ పరంగానూ ప్రస్తుత జెన్ జెడ్ కిడ్స్ లో రఫ్ కాంపిటీటర్ గా దూసుకుపోతోన్న విషయం తెలిసిందే. కిల్లర్ లుక్స్‌తో కట్టి పడేయడంలో తన తర్వాతే ఎవరైనా అన్నట్లు ఉండే ఈ బ్యూటీ తాజాగా బీచ్ వెకేషన్ లో అదిరిపోయే ఫోజులతో కట్టి పడేసింది. వంగపువ్వు రంగు లాంగ్ ఫ్రాక్ ధరించి అందంగా కనిపిస్తోంది. బీచ్ పరిసరాల్లో అందమైన రిసార్ట్ వాతావరణంలో ఎంతో స్ట్రైకింగ్ గా ఉంది. కనుచూపు మేరా నీలి రంగు సముద్రం ఎంతో మనోహరంగా కనిపిస్తుంటే.. అక్కడ స్వేచ్ఛగా సేదదీరుతూ ఆమె ఇచ్చిన ఫోజులు హృదయాలను గెలుచుకుంటున్నాయి. ఈ భామ తన వీపందాన్ని ఎలివేట్ చేస్తూ బ్యాక్ లెస్ ఫ్రాక్‌లో మతిపోగొడుతోంది. ఓవైపు సినిమాలు, మరోవైపు కొరియోగ్రఫీ అసైన్ మెంట్స్, టీవీ షోలతో బిజీ బిజీగా గడిపే ధనశ్రీ తన తీరిక సమయాన్ని ఇలా శ్రీలంక ట్రిప్‌లో యూనిక్‌గా ప్లాన్ చేసి.. ఆ జ్ఞాపకాల్ని సోషల్‌మీడియాలో షేర్ చేసింది. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం ఆమె టాలీవుడ్‌లో డ్యాన్స్ బేస్డ్ మూవీలో నటిస్తోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఆకాశం దాటి వస్తావా చిత్రంతో నటిగా పరిచయం అవుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.